# నమ్మకద్రోహి

"హలో హరిగోపాల్!" అనే పరిచితమైన పిలుపు విని నేను వెనక్కి తిరిగి చూశాను. ఢిల్లీలో ఒక మీటింగ్‌కు వెళ్ళడానికి బెంగుళూర్ ఎయిర్‌పోర్ట్‌లో చెక్-ఇన్ చేయడానికి హడావిడిగా వెళ్తున్నప్పుడే ఈ పిలుపు వినబడింది. అలా పిలిచిన వ్యక్తి, శ్రీరామ్ హెగ్డే. "గుడ్‌మాణింగ్ హెగ్డేజీ!" అని నేను పలకరించాను. "ఏమిటా తొందర? ఢిల్లీకే కదా! మీలాంటి ఐఏయస్ ఆఫీసర్లందరూ సగం టైము ఢిల్లీలో, మిగతా టైము రాష్ట్రంలో గడిపేవాళ్ళే. ఈ మంచిరోజు మిమ్మల్ని మరో అర్థగంట ఆపి ఉంచే అదృష్టం బెంగుళూర్‌కి కలిగింది."

"ఓహో! నా ఫ్లైట్ అరగంట లేటు అంతేకదా!"

"ఐఏయస్‌లు ఎంతో తెలివైన వాళ్ళని నేను ఒప్పుకుంటాను."

"దానివల్ల మీలాంటి వాళ్ళకూ, కర్ణాటక రాష్ట్రానికే కదా, ప్రయోజనం... లాభం మీద లాభం." నవ్వుతూ నేనొక అస్త్రాన్ని సంధించాను.

"త్వరగా చెక్-ఇన్‌చేసి వి.ఐ.పి. లాంజ్‌లోకి వచ్చేయండి. నామెడ్రాస్ ఫ్లైట్ కూడా ముప్పావుగంట తర్వాతే ఉంది." అని ఆయన చెప్పారు.

నేను చెక్-ఇన్‌చేసి, విఐపి లాంజ్‌లోకి వెళ్ళేటప్పటికి, హెగ్డే అక్కడ అవిశ్రాంతంగా పచార్లు చేస్తూ ఉన్నాడు.

"కొద్ది రోజుల నుంచీ, మీతో నా మనస్సు విప్పి మాట్లాడాలని అనుకుంటున్నాను."

"ఏదయినా ప్రత్యేక విషయముందా?"

"మీ అంకుల్ గోపాలకృష్ణ గురించి?"

"ఆయనిప్పుడు మద్రాసులో ఒక పెద్ద కంపెనీకి డైరెక్టర్ గదా! అది గూడా మీ ఆశీర్వాదంతోనే వచ్చుంటుంది."

"అలా చెప్పకుండా ఎందుకు వెళ్ళిపోయాడు?"

"తరువాత మద్రాసు నుంచి అతను నాకొకసారి ఫోన్ చేశాడు. ఆ సమయంలో, అతనితో ఏం మాట్లాడాలో నాకు అర్థం కాలేదు. కొన్ని రోజుల తర్వాతే, అతను నాకు కలిగించిన నష్టాల గురించి ఐడియా కలిగింది. నాకు తెలియకుండానే, గోపాలకృష్ణ, శ్రీనివాస్

కలిసి, శ్రీరామ్ ఎక్స్‌పోర్ట్ కంపెనీని అమ్మేసారట. అదేం పెద్ద లాభంతో నడిచే కంపెనీ కాదనుకోండి. కానీ, ఎంత నమ్మకంతో దాని మీద పూర్తి అధికారాలు వాళ్ళకి అప్పజెప్పానో మీకు తెలుసు కదా! దాన్ని అన్యాక్రాంతం చేసేముందు మాట మాత్రంగానైనా నాతో చెప్పుండాల్సింది. ఆ కంపెనీ, నా చేతినుండి పోవడం వల్ల, నాకెంతో నష్టం కలిగుంటుందో మీరు ఊహించగలరా?"

"కంసాలి కొలిమి దగ్గర పిల్లికేమి పని?"

"నిజమే, పిల్లి కళ్ళు వెదికేది, పాలున్న చోటునే కదా! మీరు ఎంతో ఆరోగ్యం గల యువకులు. అదలా ఉంచండి. నీకు దానిలో వచ్చిన నష్టం ఐదుకోట్లు. కానీ, వాళ్ళు దానివల్ల లాభపడింది స్వల్పమే కావచ్చు. ఈ గోపాలకృష్ణ చేసిన చవకబారు పనుల గురించి చెప్పాలంటే, నాకేసిగ్గేస్తుంది. అతనికి వాడుకోవడానికి ఇచ్చిన ఎస్టీమ్ కారు తన పేరు మీద ట్రాన్స్‌ఫర్ చేయించుకుని తీసుకెళ్ళిపోయాడు. ఆయన ఉంటున్న అద్దె ఇంట్లో, కంపెనీ ఫిక్స్ చేసిన రెండు ఎయిర్ కండీషనర్స్‌నీ కూడా తనతో పాటు తీసుకుపోయాడు. ఇంకా ఏమేం ఎత్తుకుపోయాడో నాకు తెలియదు. నన్నడిగితే వీటికన్నా ఎక్కువే ఇచ్చే వాడిని కదా!"

ఆయనకి ఊపిరి సరిగ్గా ఆడనట్టూ, సంభాషణ చివరిలో గద్గద స్వరం ధ్వనించినట్టూ నాకనిపించింది. ఆయన రెండు చేతుల్నీ నా చేతుల్తో పట్టుకుని,

"ఇదంతా వింటోంటే, నాకు బాధగా ఉంది. ఏదేమయినా, ఆ భగవంతుడు సర్వాంతర్యామి." అని ఇంగ్లీషులో అతన్ని ఓదార్చడానికి ప్రయత్నించాను.

కాస్సేపు ఏదో లోకాభిరామాయణం మాట్లాడుకున్నాము. ఆ తరువాత, మేము సెక్యూరిటీ చెక్‌కు వెళ్ళాము. ఢిల్లీకి వెళ్ళేటప్పుడు, వెళ్ళిన తర్వాత కూడా, నేను హెగ్డేకి, గోపాలకృష్ణ మధ్య చాలాకాలం నుంచీ ఉన్న మైత్రీ బంధం గురించే ఆలోచిస్తూ ఉన్నాను. హెగ్డే కర్ణాటకరాష్ట్రంలో ఉన్న వ్యాపార ప్రముఖులలో ఒకరు. ఒక ధనిక కుటుంబంలో పుట్టి, విదేశాలకు వెళ్ళి విద్యాభ్యాసం చేసి, తన కుటుంబ వ్యాపార వాణిజ్య సంస్థలను, మనదేశంలోనేకాదు, ఇతర దేశాల్లో కూడా విస్తరింపజేసిన అతి సమర్థుడైన వ్యక్తి ఈయన. ఆయనకి ఇద్దరు కొడుకులు. ఇద్దరూ అమెరికాలో ఉండటం వల్ల, భారత దర్శనంకోసం ఎప్పుడో ఒకసారి టూరిస్టుల్లాగా ఈ నగరానికి వచ్చేవారు. వెనుకటి రోజుల్లో, రాజులు రాజ్యారణ్యవాసాలు ఆరారునెలలు చేసినట్టు. హెగ్డే భార్య ఆరునెలలు ఇక్కడ, ఆరునెలలు అమెరికా సందర్శించడంలో తన జన్మకి సార్ధకత చేకూర్చుకునేది. ఆమె భారతదేశంలో, ఎప్పుడుంటుందో తెలుసుకోకుండానే హెగ్డే తన విదేశ ప్రయాణాలు ప్లాన్ చేసుకునేవాడు.

ప్రజ్ఞాశాలియైన తన భర్త తను లేకుండానే, ప్రతిదీ నిర్వహించుకోగలడని ఆమె సంపూర్ణ విశ్వాసం. ఆ నమ్మకం ప్రాయోగికంగా నిజమైనదే. ఒక కోటీశ్వరుడనే అహంభావం అతనికి లేశమాత్రమైన లేదు. మిత్రులకు ప్రాణమివ్వడానికైనా వెనుకాడని వ్యక్తి. అలా ప్రాణాలివ్వడానికి అతని దగ్గర చాలా ఉండేవి. ఒక బ్రాహ్మణుడికి రెండు జన్మలూ, పిల్లికి తొమ్మిది జన్మలూ ఉండేటప్పుడు, హెగ్డేకి తొమ్మిదివేలో తొంబైవేలో ప్రాణాలున్నాయని చెప్పడంలో అతిశయోక్తి లేదు, పేదవారికి అతను ప్రత్యక్షదైవం. హెగ్డేకున్న ఎన్నో ఫ్యాక్టరీలలో పనిచేసే వేలాదిమంది కార్మికులకు, అతను ఒక కారుణ్యమూర్తియైన యజమాని. రాష్ట్రస్థాయి, జాతీయ స్థాయిల్లోనేకాక, అంతర్జాతీయ స్థాయిలో కూడా అతనికి మంచి పలుకుబడి ఉంది.

అతనెంత గొప్పవాడైనా కానీ, మంచివాడైనా కానీ, తనమీద తనకి సంయమన శక్తి మాత్రం లేదు. ప్రతీరాత్రీ అతను తప్పతాగి, ఒళ్ళు మరచిపోయి నిద్రపోతాడు. పగటి సమయాల్లో కూడా వీలున్నప్పుడల్లా అతను తాగేవాడు. అయినా ఇప్పటివరకూ ఆయన ఆరోగ్యానికి ఎటువంటి లోపమూ కలగలేదు.

కర్ణాటకలో చాలామందికి, ఆయన ఒక ఆరాధ్యపురుషుడు. ఐఏయస్, ఐపియస్‌లో ఉన్న దాదాపు అందరు అధికార్లకు, ఆయన సుపరిచితుడే. కాస్తయినా కపటం లేని వినమ్రత చిన్న చిన్న ఉద్యోగస్థులని కూడా ఆకట్టుకునేది. ఎవరికయినా, ఏ వేళలోనయినా, ఎటువంటి సహాయం చేయడానికైనా, ఆయన సంసిద్ధంగా ఉండేవాడు.

ఆ విధంగానే, ఒక ఐఏయస్ ఆఫీసరైన గోపాల కృష్ణకి, హెగ్డేకి పరిచయం ఏర్పడటం, వారి మధ్య మైత్రీబంధం పెరగడం జరిగింది. అప్పుడు గోపాలకృష్ణ ఒక డిస్ట్రిక్ట్ కలెక్టర్‌గా ఉండేవాడు. నిజాయితీపరుడు, సమర్థుడు అని పేరు తెచ్చుకున్న గోపాలకృష్ణని చూడగానే హెగ్డేకి నచ్చాడు. ఆరోజు వారి మధ్య ఏర్పడిన స్నేహబంధం రోజురోజుకీ బలపడుతూ వచ్చింది. గోపాలకృష్ణకి కావలసిన పోస్టింగులన్నీ హెగ్డే సునాయాసంగా ఇప్పించేవాడు. మద్రాసు రాష్ట్రానికి చెందిన ఆఫీసరుకు పెద్ద పెద్ద పోస్టింగులు రావడం చూసి, మిగతా ఆఫీసర్లకు అసూయగా ఉండేది. ఉద్యోగరీత్యా మూడు నాలుగుసార్లు విదేశ యాత్ర చేయడంలో కూడా, హెగ్డే ఆయనకి సహాయపడ్డారు. గోపాలకృష్ణ వాడే ప్రైవేట్ కార్లలో, చాల మటుకు హెగ్డే కంపెనీ అమ్మకాల పేరుతో దానంచేసినవే. కారు ఖరీదు చెక్కు రూపంలో గోపాలకృష్ణ కంపెనీకి ఇస్తాడు. ఆ చెక్కు ఎన్‌క్యాస్ అయ్యి తిరిగి ఆ ఆఫీసర్‌కే చేరేది. మద్రాసులో గోపాలకృష్ణ బంధువులకు, ఆర్థికంగా కానీ, మరో విధంగా కానీ, హెగ్డే సహాయాలు చేసాడని వినికిడి. రాష్ట్రంలో ప్రిన్స్‌పల్ సెక్రటరీగా పనిచేస్తున్న కాలంలో, సెంట్రల్ గవర్నమెంట్‌లో ఇండస్ట్రీ మినిస్ట్రీలో డిప్యుటేషన్ మీద గోపాలకృష్ణ వెళ్ళాడు. ఇండస్ట్రీస్ మినిష్టర్ కర్ణాటక

రాష్ట్రానికి చెందిన వ్యక్తి. ఆమినిస్ట్రీలో గోపాలకృష్ణకి మంచి పేరొచ్చింది. భారతదేశంలోని పెద్ద పెద్ద వాణిజ్యవేత్తలతో ఆయనకి దగ్గర సంబంధాలేర్పడ్డాయి. తత్ఫలితంగా, తన కొడుకులిద్దరికీ, రెండు పెద్ద అమెరికన్ కంపెనీలలో, మంచి ఉద్యోగాలు ఇప్పించగలిగాడు. ఆ ఇద్దరు పిల్లలూ కూడా కంప్యూటర్ సైన్స్‌లో మంచి క్వాలిఫికేషన్ ఉన్నవాళ్ళే. ఆ మినిస్ట్రీలో కొంత ఎక్కువకాలం స్తుత్యర్హమైన స్థానంలో అతను సేవలు అనుష్ఠించగలిగాడు. ఆ కాలంలో, కొన్ని గణనీయమైన సహాయాలు హెగ్డేకి చేసి, తన రుణభారం నుంచి కొద్దిగా విముక్తుడు కావడానికి అతను ప్రయత్నించాడు.

యూనియన్ ఇండస్ట్రీస్ సెక్రటరీగా పదోన్నతి పొందడం దాదాపు ఖాయమని తెలిసి, గోపాలకృష్ణ ఎంతో సంతోషపడ్డాడు. హెగ్డే ఏదిచెపితే అది చేయడానికి సిద్ధంగా ఉండే కర్ణాటకమంత్రి, ఈ విషయంలో గోపాలకృష్ణకి అడ్వాన్స్‌గా తన శుభాకాంక్షలందజేసేవాడు. దురదృష్టమేమంటే, ఆ సమయంలోనే మంత్రివర్గంలో మార్పులు జరిగాయి. కర్ణాటక మంత్రి పర్యాటకశాఖకి బదిలీ అయ్యాడు. బీహార్ నుంచి ఒక కర్కోటకుడు, పరిశ్రమల శాఖామంత్రి అయ్యాడు. బీహారుకి చెందిన ఒక ఐఏయస్ ఆఫీసర్, ఇండస్ట్రీస్ సెక్రటరీగా నియమితుడయ్యాడు. కర్ణాటక రాష్ట్ర ముఖ్యమంత్రితో హెగ్డేకి సత్సంబంధాలు లేకపోవడంవల్ల గోపాలకృష్ణ అర్హతలకి సరిపోయే పదవి ఏదీ, అతనికి లభించలేదు. నిరాశపై నిరాశ, ఉద్యోగజీవితంలో, తను ఒక అగాధగర్తంలో పడిపోయినట్టు అక్కడినుండి బయటకు రావడం అసాధ్యమని అతనికి అనిపించింది.

అతని కుటుంబ జీవితంలో కూడా అనుదినం, అంధకారం గడ్డకట్టుకుంటూ వచ్చింది. అతని భార్య గర్భాశయంలో ఒక మాంస పిండం పెరుగుతుందని తెలిసి, శస్త్ర క్రియ ద్వారా దానిని మూడు సంవత్సరాల క్రితమే తొలగించారు. కానీ, మరో పధ్నాలుగు నెలలలోపలే, ఇంకొక రెండు శస్త్రక్రియలు చేయాల్సి వచ్చింది. దానితో ఆమె ఆరోగ్యం మరింత క్షీణించింది. తదనంతర చికిత్సల పరిణత ఫలంగా, ఆమె జుట్టంతా ఊడిపోయి చిక్కి శల్యావశిష్టమైపోయింది. ఆమె దురవస్థ చూసి గోపాలకృష్ణ అంతగా బాధపడలేదు. కానీ, తన ఉద్యోగజీవితంలో తగిలిన ఎదురుదెబ్బలు, భార్యని నిర్లక్ష్యం చేయడం వల్లనే వచ్చాయేమో అనే అపరాధ భావం అతని మనసుని కొరికి తినేయడం మొదలు పెట్టింది. అయినా కానీ, పరస్త్రీ ప్రాప్తి అనే తన ప్రియవినోదానికి కళ్ళెం వేయడం మాత్రం అతను సిద్ధపడలేదు. ఈ దురవస్థ నుంచి గోపాలకృష్ణని ఒడ్డుకి చేర్చడానికి అతని ఆప్తమిత్రుడు తన స్నేహ హస్తాన్ని అందించారు. మిగిలిన సంవత్సరం సర్వీసు వదిలేసి, అతను పదవీ విరమణచేసి, శ్రీరామ్ ఎక్స్‌పోర్ట్ కంపెనీలో మేనేజింగ్ డైరెక్టర్‌గా చేరాడు. పదిహేనువేల నెలజీతంతోపాటు, ఇరవైవేల

అద్దెకి ఇల్లు, కొత్త ఎస్టీమ్ కారు, ఇంకా ఆ హోదాకి తగిన ఇతర సౌకర్యాలు అతనికి ఏర్పాటు చేయబడ్డాయి. ఆ విధంగా, గవర్నమెంటు సర్వీసులో ఉన్నప్పటి కంటే కూడా ఎక్కువ సఖలైశ్వర్యాలు అతను అనుభవించగలిగాడు. సంవత్సరం లోపల, ఎగుమతులని అధికం చేయాలనే నెపంతో, అతను ఒక ప్రపంచయాత్ర ఇన్‌స్టాల్‌మెంట్స్‌లో చేశాడు. మూడోసారి అలా వెళ్ళినప్పుడు, ఆ కంపెనీలో డైరెక్టరయిన శ్రీనివాస్‌ని తన కూడా తీసుకువెళ్ళాడు. ఆ యాత్రల్లోనే వాళ్ళు కంపెనీని అమ్మాలనే పథకం సిద్ధం చేసుకున్నారు. ఏమయినా, భగవంతుడితో సమానంగా ఆరాధించాల్సిన హెగ్డేని ఇలా ముంచడం మానవత్వం అనిపించుకోదు.

నాకూ, గోపాలకృష్ణకి మధ్యనున్న చుట్టరికం మరీ అంత దూరమేం కాదు. అతని మాతా మహుని చెల్లెలి కూతురి కొడుకునే నేను. నేను ఐఏయస్‌కి రావడం అతనికి సుతరామూ ఇష్టంలేదు. మా కుటుంబంలో అతనొక్కడే అంతపెద్ద హోదాలో పనిచేస్తుండటం వల్ల నేను కూడా ఆ సర్వీసులో రంగప్రవేశంచేస్తే, తన గుత్తాదిపత్యానికి భంగం వాటిల్లుతుందని అతని భయం. మద్రాసు నుంచి వచ్చిన ఆఫీసర్లు, అందులోనూ బ్రాహ్మణులు, కర్ణాటక రాష్ట్రంలో పేరు తెచ్చుకోవడం అతనికి అంత రుచించలేదు. కర్ణాటక రాష్ట్రంలో అత్యంత మేధావి అయిన మద్రాసీ బ్రాహ్మిన్ ఆఫీసర్ తనేనని అతను గర్వించేవాడు. కలెక్టర్‌గానే గాక, ఇతర పదవులలో కూడా నేను మంచి పేరు సంపాదించుకోవడం చూసి, అతను చీఫ్ సెక్రటరీ దగ్గర నా మీద లేనిపోని చాడీలూ, కట్టుకథలు చెప్పడం వల్ల, దాదాపు ఏడాది, ఏడాదిన్నర కాలంపాటు, నాకు పనికిమాలిన పోస్టింగులు వచ్చాయి. కానీ, కొత్త చీఫ్ సెక్రటరీ వచ్చిన తరువాత, నా యోగ్యతార్హతలు తిరిగి గుర్తించబడ్డాయి.

నేను భార్యాసమేతంగా అతని ఇంటికి వెళ్ళాను కానీ, అతను మాత్రం ఒక్కసారి కూడా మా ఇంటికి రాలేదు. మేము వాళ్ళింటికి వెళ్ళినప్పుడు అతనికి మాతో మాట్లాడటం కూడా ఇష్టం లేదనిపించింది. అతని భార్య ఎంతో సహృదయురాలు. మా కుటుంబ సభ్యుల గురించి, బంధువుల గురించి క్షేమ సమాచారాలు అడుగుతూ వచ్చింది. అతను మాత్రం ఇంట్లో కూడా నాపై ఆఫీసర్ లాగే ప్రవర్తించాడు.

ఈ మధ్య శెలవు మీద కొన్ని రోజులు మద్రాసుకు వెళ్ళినప్పుడు, ఆవార్త తెలిసింది నాకు. పదిపదిహేను రోజుల క్రితం, గోపాలకృష్ణ సెరిబ్రల్ హేమరేజీ వల్ల హాస్పటల్‌లో వారం రోజులపాటు కోమాలోకి వెళ్ళిపోయినట్టు, దాన్నుంచి బయట పడిన తర్వాత అతనికి పక్షవాతం వచ్చి, ఒకచెయ్యీ, కాలు పడిపోయాయని, సరిగా మాట్లాడటానికి కూడా వీలు లేదనే ఆ వార్త. అది వినగానే, నేనూ. నా భార్య హాస్పటల్‌కు వెళ్ళి అతన్ని పరామర్శించాను.

మమ్మల్ని చూడటంతోటే, చలనం లేని కుడిచేతిని, చలిస్తున్న తన ఎడమచేత్తో పట్టుకుని పైకి లేపి, నమస్కారం చేస్తున్నట్టుగా చూపించాడు. కాస్సేపు ఆయనేమీ మాట్లాడలేదు. రెండు కళ్ళ నుంచీ కన్నీరు స్రవిస్తూనే ఉంది. నాక్కూడా ఏం మాట్లాడాలో అర్థం కాలేదు.

"త్వరలో మీరు కోలుకుంటారు." అని ఇంగ్లీషులో అతన్ని ఊరడించటానికి ప్రయత్నించాను.

అస్పష్టంగానైనా కొద్దిగ మాట్లాడటానికి ప్రయత్నిస్తూ, "లేదు, హరీ! లేదు. అక్కడ ఇంట్లో నా భార్య రోజు రోజుకి మరణానికి చేరువవుతూ ఉంటే, ఇక్కడ నేను ఒక జీవచ్ఛవంలా పడున్నాను. పిల్లలిద్దరూ అమెరికాలో ఉన్నారు. వాళ్ళకి వచ్చి మమ్మల్ని చూసే తీరికెక్కడిది? వచ్చినా ఏం చేస్తారు? వాళ్ళు ఇంజనీర్లే కానీ, డాక్టర్లు కారు కదా! ఇక్కడ మా అవసరాలు చూడ్డానికి కావలసిన మనుషులున్నారు. హరీ! నాకు తెలుసు. నాకు మోక్షం లేదని, నేనెప్పుడూ చెడ్డ పనులు చేయలేదు. నాకు తెల్సి చేసిన ఒకే ఒక మోసం, హెగ్డేని మోసం చేయడం. అదొక మహాపరాధం అని నేనొప్పుకుంటాను. అందుకు, ఆ దేవుడు కూడా నన్ను క్షమించడు. హరీ! దయచేసి నాకొక ఉపకారం చేసి పెట్టాలి. హెగ్డేగారి పాదాలు పట్టుకుని క్షమాభిక్ష యాచించాలని నా కోరిక, వారు నన్ను పాపవిముక్తుణ్ణి చేస్తే మండుతున్న నా మనస్సుకు కాస్త నెమ్మది కలుగుతుంది. అన్ని వేళలా నాకు తోడుగా ఆప్తమిత్రుడిగా నిలిచినవారికి ఇంత ద్రోహం ఎటువంటి పరిస్థితుల్లో కూడా చేయకుండా ఉండాల్సింది. నేను చేసిన నమ్మకద్రోహం మనుష్యోచితం కాదు. హెగ్డేగారిని ఒక్కసారి ఇక్కడికి రమ్మని చెప్తావా హరీ! ప్రస్తుతం నేనున్న దైన్యస్థితి తెలిస్తే, తప్పక ఆయన పరుగెత్తుకుని వస్తారు. అంత మంచి మనిషి ఆయన."

సంవత్సరాల తరబడి అతనిలో గడ్డకట్టుకుపోయిన అహంకారం, ఆ కన్నీటిలో కరిగిపోతున్నట్టు నాకనిపించింది.

"హెగ్డే గారిని నేను తప్పకుండా తీసుకొస్తాను సార్" అనే మాటలు గద్గద సమేతంగానే నా కంఠం నుంచి బయటకు రాగలిగాయి.